క్లుప్తంగా

బాలల హక్కులను కాపాడుదాం



అచ్చంపేట(క్రోసూరు): బాలల హక్కులను కాపాడాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని గుడ్ షెపర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ మండల్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పేర్కొన్నారు. పీసపాడు గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాల్యవివాహాలవల్ల వచ్చే అనర్థాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలని తెలిపారు. గ్రామ పెద్దలు పవన్‌కుమార్, నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు స్క్రీనింగ్ పరీక్షలు

అచ్చంపేట(క్రోసూరు): మండలంలోని గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు శుక్రవారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్ పరిశీలించారు. మొదటి దశలో ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ అంగన్వాడీ కేంద్రాలకు, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి స్క్రీనింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. సమస్యలు గుర్తించిన చిన్నారులను దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి, రెండవ దశలో స్క్రీనింగ్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 12 మంది ఎంపిక



అచ్చంపేట(క్రోసూరు): నిరుద్యోగ సమస్య నివారణకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.వి రమాదేవి తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం జరిగిన జాబ్ మేళ ప్రారంభ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు ప్రధాన కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, 12 మందిని ఎంపిక చేసి వారికి జాబ్ ఆఫర్ లెటర్స్ ఇచ్చారు. మొత్తం 28మంది నిరుద్యోగులు హాజరయ్యారు. క్రోసూరు స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ బి.అంజిరెడ్డి, వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డేవిడ్‌రాజు, కంపెని ప్రతినిధులు, సీడాప్ పీఓ నాగులు పాల్గొన్నారు.

భూములను ఆన్‌లైన్ చేయాలి

అచ్చంపేట(క్రోసూరు): మండల కేంద్రంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో చాలా సర్వే నంబర్లలోని భూములు ఆన్‌లైన్ చేయలేదని పేర్కొన్నారు. దీనివల్ల రైతులు ప్రభుత్వ రాయితీలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన లావాదేవీలకు కూడా వీలు లేకుండా పోయిందన్నారు. సమస్య పరిష్కారం కోసం గత పదేళ్లుగా రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా..వారి గోడు వినిపించుకోవడంలేదని వాపోయారు. రైతులతో పాటు సీపీఎం నాయకులు అనుముల లక్ష్మీశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాజీ వార్డు మెంబరు మృతి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మాజీ వార్డ్ మెంబరు చతుర్వేదుల నాగభాస్కరమణీ (101) శుక్రవారం మృతి చెందారు. ఆమె తిరుపతిలో పెద్ద కుమార్తె దయమంతి దేవితో కలసి ఉంటోంది. గతంలో సత్తెనపల్లి సర్పంచ్‌గా ఆమె భర్త సీతారామశాస్త్రి సేవలు అందించాడు. అప్పుడు ఆమె వార్డు మెంబర్‌గా పని చేశారు. ఆమె మృతి పట్ల పలువురు శుక్రవారం సంతాపం తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పెదకూరపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి గృహంలోని సామగ్రి కాలిపోయిన ఘటన మండలంలోని పాటిబండ్ల గ్రామం ఎస్సీ కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మన్నవ ఇన్నయ్య ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగి టీవీ, ఫ్యాన్లు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. కుటుంబ సభ్యులు ఆరుబయట ఉండటంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు.

మత్స్యావతారంలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీవారిని మత్స్యావతారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం శ్రీవారికి కూర్మావతార అలంకారం జరుగుతుందని తెలిపారు.

గ్రామ స్వరాజ్యానికి తూట్లు

- కళతప్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ
- సింగిల్ డిజిట్‌కే పరిమితమైన గ్రామస్తుల రాకపోకలు
- సకాలంలో అందని ధ్రువీకరణ పత్రాలు
- ఉద్యోగుల విధులు డైవర్షన్..



తాళ్ల చెరువు సచివాలయ భవనం

అచ్చంపేట: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు, ప్రజలకు స్థానికంగా సేవలు అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంది. ప్రతి 2 వేల ఇళ్లకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. అందులో 11 శాఖల సిబ్బందిని నియమించింది. ప్రజలు పనులు మానుకుని మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా ఉన్న ఊర్లోనే సేవలు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికింది. ప్రజా సేవలో ఒక వెలుగు వెలిగిన సచివాలయాలు... కూటమి ప్రభుత్వం రాగానే నిర్వీర్యమవుతున్నాయి. సిబ్బంది పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. వారిని ఇతర విధులకు బదలాయిస్తూ.. వారి విధులను విచ్ఛిన్నం చేసింది. మళ్లీ ఇప్పుడు షరా మామూలే అన్నట్లు మండల కేంద్రాలకు పనుల కోసం గ్రామీణులు పరుగులు తీస్తున్నారు.

అచ్చంపేటలో ఇలా...

అచ్చంపేట మండలంలో 23 గ్రామ పంచాయతీలు, ఆరు గిరిజన తండాలు, మూడు శివారు గ్రామాలున్నాయి. జనాభా సుమారు 65 వేలకు పైనే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 17 సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఒక్కొక్క సచివాలయంలో 11 మంది సిబ్బందిని కేటాయించింది. ప్రస్తుతం వారిలో కొందరు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. మరికొందరు నామ మాత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. 17 సచివాలయాలకు ఆరు భవనాలు అన్ని హంగులతో పూర్తికాగా, మరో 8 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇవి పూర్తయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.

విధుల డైవర్షన్...

గతంలో గ్రామ వలంటీర్లు నిర్వహించిన పనులన్నింటినీ ఇప్పుడు సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. పెన్షన్ల పంపిణీ, స్కిల్ సెన్సెస్ సర్వే, ఫీవర్ సర్వే లాంటి వన్నీ సచివాలయ సిబ్బందే చేస్తున్నారు.

తగ్గిన సేవలు..

గత ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల ద్వారా 536 సేవలు అందించేవారు. ప్రస్తుతం పది సేవలకు కూడా నోచుకోని దుస్థితి నెలకొంది. ప్రతి చిన్న పనికి మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఒక్కో పని కోసం రోజులతరబడి తిరగాల్సి వస్తోందని ప్రజలు చెబుతున్నారు. లేకుంటే గతంలో మాదిరిగానే మీ సేవా కేంద్రాలకు క్యూ కట్టాల్సి వస్తోందని వాపోతున్నారు.

సంక్షేమ కళ తప్పింది..

గతంలో అనేక సంక్షేమ పథకాలు ఉండటంతో వాటి వివరాల కోసం వచ్చి పోయే గ్రామస్తులతో సచివాలయాలు కళకళలాడుతుండేవి. ఇప్పుడు అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోవడంతో సచివాలయాలకు వచ్చే వారి సంఖ్య వందల నుంచి పదులు, ఒకట్లకు చేరింది. మత్స్య శాఖ, సెరి కల్చరల్, హార్టి కల్చరల్‌కు సంబంధించిన సిబ్బంది లేరు. మహిళా పోలీసులు, గ్రామ సర్వేయర్ల కొరత లేకపోలేదు.

పూర్వ వైభవం తేవాలి



గ్రామ సచివాలయాలకు పూర్వ వైభవం తేవాలి. గతంలో అన్ని సేవలు మా గ్రామంలోనే లభించేవి. ఇప్పుడు కొన్ని మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. రెవెన్యూ సేవల కోసం 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘ నాయకుడు, మాదిపాడు

సచివాలయానికి వెళ్లే వారే లేరు



గతంలో అన్ని రకాల సంక్షేమ పథకాలుండేవి. వాటి వివరాల కోసం గ్రామ సచివాలయాలకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు ఆ పథకాలన్ని ఆగిపోవడంతో సచివాలయాలతో పనిలేకుండా పోయింది. మళ్లీ మండల కేంద్రాలకు, మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

– అనుముల సాంబిరెడ్డి, రైతు, రుద్రవరం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు

శ్రీరామాంజనేయపురం పాఠశాల భవనం సందర్శించిన డీఈవో చంద్రకళ

సాక్షి ఎఫెక్ట్



శ్రీరామాంజనేయపురం పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ, అధికారులు

బెల్లంకొండ: మండలంలోని శ్రీరామాంజనేయపురం గ్రామంలో గతేడాది నిర్మించిన పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తప్పనిసరిగా తరగతులను ప్రారంభిస్తామని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. గ్రామంలో పాఠశాల నిర్మించినప్పటికీ చిన్నారులు పక్క గ్రామంలో ఉన్న పాఠశాలకు వెళ్తున్నారు. వారు పడుతున్న అవస్థలపై రెండు రోజుల క్రితం 'సాక్షి' దినపత్రికలో 'చదువుకు అవస్థలు' పేరిట కథనం ప్రచురితమైంది. దీంతో పాటుగా జిల్లా ఏపీటీఎఫ్ నాయకులు అందించిన వినతి పత్రానికి వెంటనే విద్యాశాఖాధికారి స్పందించారు. స్థానిక ఎంఈవోలతో కలసి గ్రామంలో ఉన్న పాఠశాలను పరిశీలించారు. గ్రామంలో ఉన్న విద్యార్థుల వివరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు డైస్ కోడ్ రాకపోవడం వల్లే ఉపాధ్యాయులను నియమించ లేకపోయినట్లు తెలిపారు. అన్నీ సమస్యలు పరిష్కరించి, ఉపాధ్యాయులను నియమిస్తామని డీఈవో వివరణనిచ్చారు. ఎంఈవోలు బాలసుందరరావు, శ్రీనివాసరావు, సిబ్బంది నరసింహారావు, సాంబశివరావు పాల్గొన్నారు.

చదువుపై మక్కువ పెంచుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్ చంద్రకళ వెంకటాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల హెచ్ఎం బలరాంనాయక్, ఉపాధ్యాయులు నాగలక్ష్మీ, అరుణకుమారి, స్వాతి, ఫర్హానా, సీఆర్పీ నరసింహారావు, సాంబశివరావు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబున్ బీ



మాట్లాడుతున్న ఎంపీపీ

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబున్ బీ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్స్ హౌస్ హోల్డ్‌కు యాడ్ చేయడం, ఎన్‌పీసీఐ లింకింగ్ వంటి పలు కార్యక్రమాలు చేపట్టిందని, ప్రజలు ఈ సర్వేలకు సహకరించాలని కోరారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మండలం లోని అన్ని ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్ లను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. మండల విస్తరణ అధికారి ఎ. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ మంగ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సత్తెనపల్లి ఏడీఏ ఎస్.శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరాలి

సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు



ర్యాలీ ప్రారంభించి మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతురావు

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరాలని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతురావు అన్నారు. పట్టణంలోని పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం నుంచి చెక్ పోస్ట్ సెంటర్ వరకు వాహనదారులు హెల్మెట్ ధరించాలని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య, రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, రూరల్ ఎస్‌హెచ్ఓ పాలూరి శ్రీనివాసరావు, సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీలకు హర్షవర్ధన్ రాజు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ మక్కెన అచ్చయ్య

సత్తెనపల్లి: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి బి.హర్షవర్ధన్ రాజు సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో వైజాగ్‌లో జరిగిన వింటర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో హర్షవర్ధన్ రాజు ప్రతిభ చూపి 5 పతకాలు సాధించాడన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజులు విజయవాడలో జరిగే సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాపియన్ షిప్‌కు ఆంధ్ర ప్రదేశ్ స్విమ్మింగ్ టీమ్ నుంచి హర్షవర్ధన్ రాజు ప్రాతినిధ్యం వహించబోతున్నాడని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో హర్షవర్ధన్ రాజుని ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, డైరెక్టర్ పరిటాల నరేష్, స్విమ్మింగ్ కోచ్ జి.సురేష్, ఉపాధ్యాయులు భద్రయ్య, సందీప్, ఫిజికల్ డైరెక్టర్ గంపా శ్రీనివాస్, పి.శివరామకృష్ణ తదితరులు అభినందించారు.

దేవుడిపైనే భారం



వరి ధాన్యంపై పట్ట కప్పుతున్న రైతు



నూర్పిడి చేస్తున్న వరి కోత యంత్రం

నకరికల్లు: తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. రెండు రోజులుగా మబ్బులు కమ్మి చిరు జల్లులు కురుస్తూ రైతులను హడలెత్తిస్తున్నాయి. మండలంలో సుమారు 18వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. పంట కోత సమయమిది. ఈ తరుణంలో తుఫాన్ సూచనలతో అన్నదాతలకు ఏటూ పాలుపోని పరిస్థితి దాపురించింది. వరి కోత చేపట్టకపోతే..పంట వాలిపోయి గింజ మొలక వస్తుంది. పంట కోస్తే..ఓదెల పైనే ధాన్యం తడిచిపోతుంది. ఇక చేసేది లేక గంటకు రూ.3 వేలు పెట్టి హార్వెస్టర్లతో వరి కోత పూర్తి చేస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది గంటకు రూ.600లు అధికంగా వరి కోతలకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. పొడిగా ఉన్న పొలాల్లో రైతులు కోతలు మొదలు పెట్టారు. నీరు నిలిచిన, మిషన్ వెళ్లేందుకు వీలు లేని పొలాల రైతులు దేవుడిపైనే భారం వేశారు. ఒక వారం పాటు వర్షం ఆగితే తప్ప ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే పరిస్థితి కన్పించడం లేదని చెబుతున్నారు.

నేడు మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

అమరావతి: మండల కేంద్రంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జన్మదిన వేడుకలకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు భవిరిచెట్టి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ జరుగుతుందని, అనంతరం గంటలమ్మ చెట్టు వద్ద జన్మదిన కేక్‌ను కట్ చేసి, వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

అచ్చంపేట: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి జన్మదినోత్సవాలు శనివారం ఉదయం 10 గంటలకు జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు.

సత్తెనపల్లి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఉదయం 9:30 గంటలకు జరుగుతాయని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేక్ కటింగ్ అనంతరం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పండ్లు, రొట్టెలు పంపిణీ, నరసరావుపేట రోడ్డులోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఏసు మార్గం ఆచరణీయం

అచ్చంపేట: ఏసుక్రీస్తు మార్గం ఆచరణీయమని ప్రముఖ వైద్యుడు మామిళ్లపల్లి మధుసూదనరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దయ, కరుణ, జాలి కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌సీ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని 8వ వార్డు క్రిస్టియన్‌పేటలో రెవ.డాక్టర్ విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బాప్టిస్ట్ ఫీల్డ్ సంఘ కాపరులను ఆహ్వానించి సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కానుక, నూతన వస్త్రాలను బహూకరించారు. కేక్ కటింగ్ అనంతరం ప్రేమ విందు అందించారు. ప్రత్తిపాడు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



పట్టణంలోని తాలూకా సెంటర్‌లో మాట్లాడుతున్న చుక్కా చంద్రపాల్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో మాల మహానాడు నాయకులు

సత్తెనపల్లి: రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురించి పార్లమెంటులో అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్, మాలమహానాడు ఆధ్వర్యంలో ఖండించి శుక్రవారం పట్టణంలోని తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద వేర్వేరుగా బీజేపీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. చుక్కా చంద్రపాల్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో అమిత్ షా ముడుపుల వ్యవహారాన్ని లేవనెత్తడంతో జీర్ణించుకోలేని అమిత్ షా అంబేడ్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞాన రాజ్‌పాల్, పీసీసీ కార్యదర్శి మాధంశెట్టి వేదాద్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, అంబేడ్కర్ ప్రజా సంఘం జిల్లా అధ్యక్షుడు దావులూరి కోటేశ్వరరావు, చాంద్ బాషా, కోట ఆనంద్, కోడిరెక్క దేవదాస్, మాలే పద్మారావు, జాన్‌బాబు, సుధాకర్, సిద్దల మోహన్‌రావు, జెట్టి శేఖర్, సాంబశివరావు, తలతోటి కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

అమరావతి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి పార్లమెంటు సాక్షిగా చేసిన వ్యాఖ్యలకు మాల మహానాడు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు అనంతరం అమిత్ షా కు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అక్షయ్ కుమార్, సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు పాల్గొన్నారు.

ఎవరు పర్మిట్ ఇచ్చారో మరీ..!



అమరావతి: మండలంలో మద్యం దుకాణాల వద్ద సకల సౌకర్యాలతో మందు బాబులకు అనధికార పర్మిట్ రూమ్‌లు, బెంచీలు ఏర్పాటు చేశారు. షెడ్లు కట్టి దర్జాగా అందులో బెంచీలు వేసి, మందు బాబులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. పెదకూరపాడు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను దీనిపై వివరణ ఇస్తూ ఇంత వరకు పెదకూరపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం షాపులకు ఎటు వంటి పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వలేదని వెల్లడించారు. మరి పైన కన్పిస్తున్న షెడ్డుకు ఎవరు అనుమతిచ్చారో అధికారులకే తెలియాలి.

గో సంరక్షణ అందరి బాధ్యత

అచ్చంపేట: గోవులను సంరక్షించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రముఖ్ సుబ్బారాయుడు పేర్కొన్నారు. తాళ్లచెరువు బీసీ కాలనీలోని తిరుపతమ్మ తల్లి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు తుమ్మా లూర్థూమర్రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి గో పూజ నిర్వహించారు. సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని గోవుల ప్రాముఖ్యతను వివరించారు. జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంకారావం సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. మండల ప్రముఖ్‌లుగా నాయక్, మన్నం భద్రి, పసుపులేటి జనార్దన్ విధులు చేపట్టారు. మన్నం చలపతిరావు, దాసరీ లక్ష్మీమంగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం



వాలీబాల్ విజేతలకు కప్పు అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: విద్యార్థులు పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించాలన్నారు. పదవ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన వారికి, జాతీయ స్థాయి అండర్–19 బాలికల వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ప్రిన్సిపల్ జగదీష్‌కుమార్ గుప్తా, వైస్ ప్రిన్సిపల్ బి.కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సత్తెనపల్లి: విద్యార్థులు చదువుతో అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం రాత్రి నిర్వహించిన 39వ వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులను తల్లిదండ్రులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఎంఈఓ శ్రీనివాసరావు, ఫాదర్ ఎన్.రాజేష్, కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సా, హెచ్ఎం సిస్టర్ విజయరాణి, సిస్టర్ జయ రత్నమాల మాట్లాడారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎంపీడీవో కార్యాలయం ఖాళీ



ముప్పాళ్ళ: ప్రభుత్వ ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 3.30 గంటల వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం.. సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిచ్చింది. కార్యాలయ ఉద్యోగులు ఎవరూ లేక పోగా, కార్యాలయానికి సంబంధం లేని ఓ వృద్ధురాలిని కాపలాగా ఉంచారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలకు ఖాళీగా కుర్చీలు దర్శనమిచ్చాయి. వచ్చిన వారు కాసేపు చెట్ల కింద పడిగాపులు కాసి, అప్పటికీ సిబ్బంది రాకపోవటంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.